

వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

# శ్రీకృష్ణ వ్రతం

సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



## విశ్వపతి



ఓం దేవకీనందనాయ విద్మహే ।
వాసుదేవాయ ధీమహీ
తన్నో కృష్ణ ప్రచోదయాత్ ॥



అధరం - మధురం, వదనం - మధురం
నయనం - మధురం, హసితం - మధురం
హృదయం - మధురం, గమనం - మధురం
మధురాధిపతే రఖిలం మధురం

శ్రీరస్తు    శుభమస్తు    అవిఘ్నమస్తు

# శ్రీకృష్ణ వ్రతం

సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము




విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)



శ్రీ

**శ్రీ డిజైన్స్**

**VEDIC LOGO DESIGNERS**

www.lordofsevenhills.com

Phone : 9849443752

**హైదరాబాదు**

**2017**


# శ్రీకృష్ణ వ్రతం

సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి


© సర్వహక్కులు రచయితవి.



First Edition : 2017

వెల : అమూల్యం


తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలు
ఈ వెబ్‌సైట్‌ల నుంచి ఉచితంగా ప్రింట్ చేసుకొనవచ్చును.

**www.lordofsevenhills.com**
**www.vratams.com**


**T.V.R.K. MURTHY,** M.Tech
Flat No. 202, Plot No. 11, Sai's Arunodaya Apartments,
Sunder Nagar Colony, Near Erragadda,
HYDERABAD - 500 038, India.
Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com, shridesigns@gmail.com

# నివేదన

వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనమ్
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీకృష్ణుడు పరమదయాస్వరూపుడు. తన భక్తులంటే స్వామికి ఎంతో ప్రేమ, ఎంతో అనురాగం. ఎల్లవేళలా తననే స్మరిస్తూ ఉండే భక్తులను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. ఒక్కసారి గొంతెత్తి శ్రీకృష్ణా! గోపాలా! గోకులనందనా! అని నిష్కళంక భక్తితో పిలిస్తే చాలు. తక్షణం వచ్చి ఆ భక్తుని ఆదుకుంటాడు. ఎంతటి ఆపదలో ఉన్నా క్షణంలో ప్రత్యక్షమై రక్షిస్తాడు.

అంతటి ప్రేమామృతమూర్తి అయిన శ్రీకృష్ణభగవానులవారు ఒకనాడు కలలో ప్రత్యక్షమై కలియుగంలో తన భక్తులందరినీ అనుగ్రహించడానికి ఒక తేలికైన వ్రతవిధానాన్ని ఉపదేశించారు. ఇదంతా ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాను. ఆ వెంటనే వ్రతకథలు వ్రాయడం ప్రారంభించాను. రెండు కథలు వ్రాయగానే ఏవో ఆటంకాలు కలిగి ముందుకు సాగలేదు. ఒకనాటి సాయంత్రం ఏదో ఆలోచిస్తూ కూర్చుని ఉండగా బాలకృష్ణుడు చేతిలో మురళి పట్టుకుని నా చుట్టూ వేగంగా పరిగెత్తసాగాడు. ఈ వ్రతం ఎప్పుడు పూర్తి చేస్తావని అడిగాడు. నా ఆనందానికి అంతు లేదు. వెంటనే వ్రతకథలు అయిదు పూర్తి చేశాను.

ఇంతలో దైనందిన జీవితంలో పని ఒత్తిడి కావటంతో పుస్తకం ప్రచురణ చేయించకుండా ఆలస్యం చేశాను. ఒకనాడు ప్రింటింగ్ మొదలుపెడదామని చూస్తే నేను రాసిన వ్రాత ప్రతి మాయమైంది. ఎంత వెతికినా కనపడలేదు. నేను అశ్రద్ధ చేశానని, ఆ బాలకృష్ణుడు ఇంట్లోనుంచి బయటకు పరిగెత్తాడని నాకు అర్థమైంది. ఇప్పటిదాకా ఇరవై అయిదు పుస్తకాలు రచించాను. ఎప్పుడూ ఈవిధంగా వ్రాతప్రతిని పోగొట్టుకోలేదు. ఇలా జరిగినందుకు మా దంపతులు ఇద్దరం ఎంతో బాధపడ్డాము.

నేను, రుక్మిణి ఆ శ్రీకృష్ణ భగవానులవారిని మా తప్పులు మన్నించమని ఎన్నో విధాల వేడుకున్నాము. శ్రీకృష్ణవ్రతాన్ని తిరిగి అనుగ్రహించమని ఎంతో ప్రార్థించాము. భక్తవత్సలుడైన శ్రీకృష్ణులవారు కరుణించారు. రెండు రోజులలో శ్రీకృష్ణ వ్రతం ఆ గోకులనందనుని అనుగ్రహంతో ఒక ప్రవాహంలా వచ్చింది. ఈ సారి ఆ స్వామి స్వప్నదర్శనమిచ్చి మా దంపతులిద్దరిని ఎదురుగా కూర్చుండబెట్టుకుని ఈ వ్రతకథలను ఉపదేశించారు. ఆ స్వామి అనుగ్రహం తిరిగి కలిగినందులకు మేమిద్దరం ఎంతో సంతోషించాము.

శ్రీకృష్ణుడు పరమదయాస్వరూపుడు. ఆ స్వామి అనుగ్రహం మా కుటుంబంపై కలగటం ఎన్నో జన్మల పుణ్యఫలం తప్ప మరొక్కటి కాదు. ఆ గోపాలకృష్ణుడు, మేము ఎన్నో జన్మల పూర్వజన్మలలో చేసుకున్న పుణ్యఫలంగా ఈ శ్రీకృష్ణవ్రతం అనుగ్రహించారని మా విశ్వాసం. లేకపోతే అతి సామాన్యులమైన మేమేమిటి? ఇంతటి అనుగ్రహానికి పాత్రులవటమేమిటి?

ఆ శ్రీకృష్ణులవారే అనుగ్రహించిన ఈ వ్రతం ఆచరింపటం అతి సులభం. ఎవరైనా, ఎప్పుడైనా, ఎటువంటి నియమనిష్టలూ లేకుండా తేలికగా ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరిస్తున్న ప్రదేశంలో బాలకృష్ణుడు అదృశ్యరూపంలో నాట్యమాడతాడు. అక్కడ ఉన్న భక్తులందరినీ తప్పక అనుగ్రహిస్తాడు. వీలున్నప్పుడల్లా మనమందరం ఈ వ్రతం ఆచరించి ఆ స్వామి అనుగ్రహానికి లోనవుదాం. మన జీవితాలు శుభప్రదం చేసుకుందాము.

ఈ పుస్తకరచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహకరించిన ప్రతి ఒక్కరికి ఆ గోపాలకృష్ణుని అనుగ్రహం కలగాలని ప్రార్థిస్తున్నాను. ఈ శ్రీకృష్ణవ్రతం ఆచరించిన మీకు, వ్రతకథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీకృష్ణ భగవానులవారిని ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు
తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

- ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఏకాదశి, పౌర్ణమి తిథులందు గానీ, రోహిణీ, స్వాతి, శ్రవణా నక్షత్రములయందు కానీ పఠిస్తే మరింత శుభప్రదం. బుధవారం నాడు చదివితే చాలా మంచిది. ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఎటువంటి ఆపదలూ కలుగవు, అపమృత్యుభయం ఉండదు. చదివే శక్తిలేనివారికి, వారి బంధువు లెవ్వరైనా చదివి వినిపించినా, ఎంతో ఫలం కలుగుతుంది. ఈ వ్రతం ఆచరించే రోజున తప్పక ఉపవాసం ఉండాలనే నియమం లేదు.
- శ్రీకృష్ణ భగవానులవారికి ఎంతో ప్రీతికరమైన శ్రీకృష్ణాష్టమినాడు, ఫాల్గుణ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాలలో ఆచరిస్తే ఎంతో ఫలదాయకంగా ఉండగలదు. ఈ శ్రీకృష్ణవ్రతాన్ని స్వగృహంలో కానీ, వసతి గృహంలో కానీ, ఏ ఆలయంలో కానీ, నదీ తీరంలో కానీ, ఏ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కానీ ఆచరించవచ్చును. శ్రీకృష్ణులవారికి ఎంతో ప్రీతికరమైన మధుర, ద్వారక, పూరి, గురువాయూర్, ఉడుపి, తిరుమల, శ్రీరంగం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఆచరించిన ఎడల మిక్కిలి ఫలదాయకం.
- శ్రీ కృష్ణ వ్రతం ఆచరించటం చాలా సులభం. ఇంట్లోకానీ, శ్రీకృష్ణులవారి ఆలయంలో కానీ ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలు పెట్టవలెను. అష్టోత్తర నామాలు పఠించాలి. శ్రీ స్వామివారి అథాంగపూజ చేసి తరువాత ఈ పుస్తకంలోని అయిదు కథలను చదివి స్వామివారికి ఏ ఫలమునైనా నివేదింపవచ్చును.
- శ్రీకృష్ణ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.
- దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి మనశ్శాంతి కలుగుతుంది.
- సంతానం కోరేవారు వరుసగా ఏడు బుధవారాలు ఈ వ్రతం ఆచరిస్తే త్వరలోనే చక్కటి సంతానాన్ని పొందుతారు. అలాగే ఆర్థిక సమస్యలతో ఉన్నవారు ఏడు వారాలు ఈ వ్రతం ఆచరిస్తే ఆ సమస్యలన్నీ వెంటనే తొలగిపోతాయి. శ్రీకృష్ణాష్టమినాడు ఈ వ్రతం ఆచరిస్తే ఎంతో శుభప్రదం.
- వివాహం కాని యువతీ యువకులు ఆ వ్రతం ఆచరిస్తే వారికి చక్కటి జీవితభాగస్వామి లభిస్తాడు. ఏ పనులైనా చాలా ఆలస్యం అవుతుంటే ఈ వ్రతం ఆచరిస్తే అవాంతరాలు అన్నీ తొలగిపోయి ఆ పనులు త్వరగా, విజయవంతంగా జరగుతాయి.
- ఏదైనా శుభకార్యం తలపెట్టినప్పుడు ఈ వ్రతం ఆచరిస్తే శ్రీ కృష్ణులవారి అనుగ్రహంతో ఆ కార్యం విజయవంతమవుతుంది. మనస్సు అశాంతిగా ఉన్నప్పుడు కానీ, ఏదైనా అనుకోని కష్టం కలిగినప్పుడుకానీ, తిథి, వార, నక్షత్రాలతో నిమిత్తం లేకుండా ఈ వ్రతం ఆచరించవచ్చు. ఆ స్వామి అనుగ్రహంతో మనస్సు ప్రశాంతమై ఆ కష్టం వెంటనే తొలగిపోతుంది.
- వీలున్నప్పుడు ఈ వ్రతం పురోహితుని సహకారంతో ఆచరిస్తే మంచిది. కలశస్థాపన చేసి అష్టదిక్పాలకులను, నవగ్రహదేవతలను, లోకపాలకులను మండపంపై ఆయా దిక్కులలో ఆవాహన చేసి పూర్తి విధానంతో ఈ వ్రతం చేస్తే శుభప్రదం.
- మరొక ముఖ్య విశేషమేమంటే శ్రీకృష్ణులవారికి తన భక్తులంటే ఎంతో ప్రేమ, ఎంతో అనురాగం. ఈ వ్రతం ఎక్కడ ఆచరిస్తున్నారో అక్కడ బాలకృష్ణుని రూపంలో తాను అదృశ్యంగా నాట్యమాడతానని శ్రీస్వామివారే సెలవిచ్చారు. బాలకృష్ణుని గజ్జెల చప్పుడు, మురళీనాదం కూడా భక్తులకు వినపడతాయి. ఎవరైతే ఈ శ్రీకృష్ణవ్రతాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారో అక్కడ ఆ బాలకృష్ణుని అడుగుల ముద్రలు కూడా దర్శనమిస్తాయని సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణ భగవానులవారే సెలవిచ్చారు. ఆ ప్రదేశంలో ఆ రోజంతా తాను ఆడుతూ, పాడుతూ ఆనందంగా తిరుగుతుంటానని శ్రీకృష్ణ భగవానులవారు సెలవిచ్చారు.

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి శ్రీకృష్ణుల వారి అనుగ్రహం పొందవచ్చును.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

## అధాంగపూజ

| | |
|---|---|
| ఓం శ్రీకృష్ణాయ నమః | పాదౌ పూజయామి. |
| ఓం రాజీవలోచనాయ నమః | గుల్ఫౌ పూజయామి. |
| ఓం వాచస్పతయే నమః | జంఘే పూజయామి. |
| ఓం నరకాంతకాయ నమః | జానునీ పూజయామి. |
| ఓం విశ్వరూపాయ నమః | ఊరూ పూజయామి. |
| ఓం బలభద్రానుజాయ నమః | గుహ్యం పూజయామి. |
| ఓం విశ్వమూర్తయే నమః | జఘనం పూజయామి. |
| ఓం గోపీజనప్రియాయ నమః | కటిం పూజయామి. |
| ఓం పరమాత్మనే నమః | ఉదరం పూజయామి. |
| ఓం శ్రీకంఠాయ నమః | హృదయం పూజయామి. |
| ఓం యజ్ఞినే నమః | పార్శ్వౌ పూజయామి. |
| ఓం త్రివిక్రమాయ నమః | పృష్ఠ దేహం పూజయామి. |
| ఓం పద్మనాభాయ నమః | స్కంధౌ పూజయామి. |
| ఓం సర్వాస్త్రధారిణే నమః | భుజౌ పూజయామి. |
| ఓం కమలనాథాయ నమః | హస్తౌ పూజయామి. |
| ఓం వాసుదేవాయ నమః | కంఠం పూజయామి. |
| ఓం సనాతనాయ నమః | వదనం పూజయామి. |
| ఓం వసుదేవాత్మజాయ నమః | నాసికం పూజయామి. |
| ఓం పుణ్యాయ నమః | శ్రోత్రే పూజయామి. |
| ఓం శ్రీశాయ నమః | నేత్రాణి పూజయామి. |
| ఓం నందగోపప్రియాయాయ నమః | భ్రువౌ పూజయామి. |
| ఓం దేవకీనందనాయ నమః | భ్రూమధ్యం పూజయామి. |
| ఓం శకటాసురమర్దనాయ నమః | లలాటం పూజయామి. |
| ఓం శ్రీ కృష్ణాయ నమః | శిరః పూజయామి. |
| ఓం శ్రీబాలకృష్ణాయ నమః | సర్వాణ్యంగాని పూజయామి. |

## శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి

ఓం కృష్ణాయ నమః
ఓం కమలనాథాయ నమః
ఓం వాసుదేవాయ నమః
ఓం సనాతనాయ నమః
ఓం వసుదేవాత్మజాయ నమః
ఓం పుణ్యాయ నమః
ఓం లీలామానుష విగ్రహాయనమః
ఓం శ్రీవత్సకౌస్తుభధరాయ నమః
ఓం యశోదవత్సలాయ నమః
ఓం హరియే నమః
ఓం చతుర్భుజాత్తచక్రాసి గదా
శంఖాద్యాయుధాయ నమః
ఓం దేవకీనందనాయ నమః
ఓం శ్రీశాయ నమః
ఓం నందగోప ప్రియాత్మజాయ నమః
ఓం యమునావేగ సంహారిణే నమః
ఓం బలభద్ర ప్రియానుజాయ నమః
ఓం పూతనాజీవిత హరాయ నమః
ఓం శకటాసుర భంజనాయ నమః
ఓం నందవ్రజ జనానందినే నమః
ఓం సచ్చిదానంద విగ్రహాయ నమః
ఓం నవనీత ప్రియాయ నమః
ఓం నవనీత నటాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం నవనీత నవాహారాయ నమః
ఓం ముచుకుంద ప్రసాదకాయ నమః
ఓం షోడశ స్త్రీసహస్రేశాయ నమః
ఓం త్రిభంగినే నమః
ఓం మధురాకృతయే నమః
ఓం శుకవాగ మృతాబ్దీందవే నమః
ఓం గోవిందాయ నమః
ఓం యోగినాంపతయే నమః
ఓం వత్సవాట చరాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం ధేనుకాసుర భంజనాయ నమః
ఓం తృణీకృత తృణావర్తాయ నమః
ఓం యమళార్జున భంజనాయ నమః
ఓం ఉత్తలోత్తాల భేత్రే నమః
ఓం తమాల శ్యామలాకృతయే నమః
ఓం గోపగోపీశ్వరాయ నమః
ఓం యోగినే నమః
ఓం కోటిసూర్య సమప్రభాయ నమః
ఓం ఇళాపతయే నమః
ఓం పరంజ్యోతిషే నమః
ఓం యాదవేంద్రాయ నమః
ఓం యదూద్వహాయ నమః
ఓం వనమాలినే నమః
ఓం పీతవాసనే నమః
ఓం పారిజాతపహారకాయ నమః
ఓం గోవర్ధనాచలోద్ధర్త్రే నమః
ఓం గోపాలాయ నమః
ఓం సర్వపాలకాయ నమః
ఓం అజాయ నమః
ఓం నిరంజనాయ నమః
ఓం కామజనకాయ నమః

ఓం కంజలోచనాయ నమః
ఓం మధుఘ్నే నమః
ఓం మధురానాథాయ నమః
ఓం ద్వారకానాయకాయ నమః
ఓం బలినే నమః
ఓం బృందావనాంత సంచారిణే నమః
ఓం తులసీదామ భూషణాయ నమః
ఓం శమంతక మణేర్హ ర్త్రే నమః
ఓం నరనారాయణాత్మకాయ నమః
ఓం కుబ్జాకృష్ణాంబర ధరాయ నమః
ఓం మాయినే నమః
ఓం పరమపురుషాయ నమః
ఓం ముష్టికాసుర చాణూర
మల్లయుద్ధ విశారదాయ నమః
ఓం సంసార వైరిణే నమః
ఓం కంసారయే నమః
ఓం మురారయే నమః
ఓం నరకాంతకాయ నమః
ఓం అనాదిబ్రహ్మచారిణే నమః
ఓం కృష్ణావ్యసన కర్శకాయ నమః
ఓం శిశుపాల శిరచ్ఛేత్రే నమః
ఓం దుర్యోధన కులాంతకాయ నమః
ఓం విదూరాక్రూర వరదాయ నమః
ఓం విశ్వరూప ప్రదర్శకాయ నమః
ఓం సత్యవాచే నమః
ఓం సత్యసంకల్పాయ నమః
ఓం సత్యభామారతాయ నమః
ఓం జయినే నమః
ఓం సుభద్రా పూర్వజాయ నమః

ఓం విష్ణవే నమః
ఓం జిష్ణవే నమః
ఓం భీష్మముక్తి ప్రదాయకాయ నమః
ఓం జగద్గురవే నమః
ఓం జగన్నాథాయ నమః
ఓం వేణునాద విశారదాయ నమః
ఓం వృషభాసుర విధ్వంసినే నమః
ఓం బాణాసుర బలాంతకృతే నమః
ఓం యుధిష్ఠిర ప్రతిష్ఠాత్రే నమః
ఓం బర్హిబర్హావతంసకాయ నమః
ఓం పార్థసారథియే నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం గీతామృత మహోదధియే నమః
ఓం కాళీయ ఫణిమాణిక్య రంజిత
శ్రీపదాంబుజాయ నమః
ఓం దామోదరాయ నమః
ఓం యజ్ఞభోక్త్రే నమః
ఓం దానవేంద్ర వినాశకాయ నమః
ఓం నారాయణాయ నమః
ఓం పరబ్రహ్మణే నమః
ఓం పన్నగాశన వాహనాయ నమః
ఓం జలక్రీడా సమాసక్తాయ నమః
ఓం గోపీవస్త్రాప హారకాయ నమః
ఓం పుణ్యశ్లోకాయ నమః
ఓం తీర్థకృతే నమః
ఓం వేదవేద్యా నమః
ఓం దయానిధయే నమః
ఓం సర్వతీర్థాత్మకాయ నమః
ఓం సర్వగ్రహ రూపిణే నమః
ఓం పరాత్పరాయ నమః

# శ్రీకృష్ణ ప్రార్థన

కరారవిందేన పదారవిందం ముఖారవిందే
వినివేశ యంతమ్
వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం
మనసా స్మరామి ॥
కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవ మౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్
సర్వాంగే హరి చందనం చ కలయన్ కంఠే చ ముక్తావళిం
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః ॥

# శ్రీకృష్ణవ్రతం

## ప్రథమ అధ్యాయము

# భగవాన్ శ్రీకృష్ణ అనుగ్రహము

శ్రీకృష్ణుడు దయాస్వరూపుడు. పరమ ప్రేమమూర్తి, ఎంతో అందమైన స్వరూపం కలవాడు. శ్రీకృష్ణుడంటేనే సమస్త సృష్టినీ తనవద్దకు ఆకర్షించుకునేవాడని అర్థం. విశ్వానికంతటికీ ఆనందం అందించే అమృతమూర్తి. శ్రీకృష్ణులవారికి తన భక్తులంటే వల్లమాలిన అభిమానం. తనను నమ్మి కొలచేవారిని ఆ గోపాలుడు కంటికి రెప్పలా కాపాడతాడు. ఆ గోవిందుని అనుగ్రహం పొందడానికి ఏ యజ్ఞ యాగాదులూ చేయనవసరం లేదు. కేవలం గోవిందా, గోపాలా, గోకులనాథా అంటూ ఆర్తితో ఒక్కసారి పిలిస్తే చాలు. ఆ గోపాలుడు తక్షణం వచ్చి మనల్ని అనుగ్రహిస్తాడు. ఆ గోకుల నందనుడు అంతటి కరుణామూర్తి. శ్రీకృష్ణభగవానుడు ఒకానొక శుభదినాన విశ్వపతి అనే భక్తునికి స్వప్నదర్శనమిచ్చి విశ్వపతి, రుక్మిణి దంపతులను అనుగ్రహించి కలియుగంలో తన భక్తులకోసం ఒక దివ్య వ్రతాన్ని అనుగ్రహించాడు. మన అందరి కష్టాలు ఆ స్వామికి తెలిసినట్లుగా మరెవ్వరికీ తెలియదు. అందుకే ఆ స్వామి తన అనుగ్రహం పొందడానికి ఎంతో తేలికైన విధానాన్ని మనకు ఈ దంపతుల ద్వారా మనకు అనుగ్రహించాడు.

శ్రీకృష్ణ భగవానులవారు విశ్వపతికి అద్భుతమైన స్వప్నదర్శనమిచ్చి విశ్వపతి, రుక్మిణి దంపతులకు కలియుగంలో తన అనుగ్రహం పొందడానికి అతి తేలికైన వ్రతవిధానాన్ని ఈ విధంగా ఉపదేశించారు. ఓ ప్రియదంపతులారా! మీపై నాకెంతో అనురాగం, ఆప్యాయత. ఇప్పుడు నేను కలియుగంలో నా అనుగ్రహం పొందడానికై ఒక తేలిక వ్రతవిధానాన్ని వివరిస్తున్నాను. ఇది మీరు ఈ లోకంలో నా భక్తులందరికీ వ్యాపింపచేయండి. ఈ వ్రతం అతి తేలికైనది. ఎవరైనను కులం, వయసు, స్త్రీ, పురుష భేదం లేకుండా ఎప్పుడైనా ఆచరించవచ్చును. ముఖ్యంగా ఏకాదశి, పౌర్ణమి తిథులందు కానీ రోహిణి, స్వాతి, శ్రవణా నక్షత్రములయందు కానీ ఆచరించిన యెడల మిక్కిలి ఫలదాయకము. అలాగే నాకెంతో ప్రీతికరమైన శ్రీకృష్ణాష్టమి నాడు, ఫాల్గుణ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాలలో ఆచరిస్తే మరెంతో ఫలదాయకంగా ఉండగలదు. నా అనుగ్రహం కోరే భక్తులు ఈ ప్రత్యేక రోజులలోనే కాకుండా వారికి వీలైన ఏ రోజునైనా ఈ వ్రతం ఆచరింపవచ్చును.

ఈ శ్రీకృష్ణ వ్రతాన్ని మీ స్వగృహంలో కానీ, వసతి గృహంలోకానీ, ఏ ఆలయంలో కానీ, నదీ తీరంలో కానీ ఏ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కానీ ఆచరించవచ్చును. నాకెంతో ప్రీతికరమైన మధుర, ద్వారక, పూరి, గురువాయూర్, ఉడిపి, తిరుమల, శ్రీరంగం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఆచరించిన ఎడల మిక్కిలి ఫలదాయకము.

శ్రీకృష్ణ వ్రతం ఆచరింపటం అతిసులభం. ఉదయాన్నే స్నానమాచరించి మీ గృహంలో ఉన్న పూజామందిరంలో నా విగ్రహాన్ని కానీ, పటాన్ని కానీ ఉంచుకొనవలెను. ఈ వ్రతం దంపతులిద్దరూ కలిసి కానీ లేదా విడివిడిగా కానీ ఎవరికి వీలున్నప్పుడు వారు ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించిన వెంటనే మీకోరిక నెరవేరగలదు. వివాహం కానివారు ఆచరిస్తే వెంటనే వివాహం కాగలదు. అనారోగ్యం ఉన్నవారు ఆచరించిన వెంటనే వారి అనారోగ్యం తొలగిపోగలదు. ప్రతీమాసం ఈ వ్రతం ఆచరించే వారికి ఎటువంటి ఆపద కలగదు. తలపెట్టిన కార్యాలన్నింటిలో జయం కలుగుతుంది. సర్వ శుభాలు కలుగుతాయి. ఈ వ్రతం ఆచరింపలేక పోయినను కేవలం కథలు చదివినా, విన్నా, ప్రసాదం స్వీకరించినా ఎంతో పుణ్యం కలుగుతుంది.

శ్రీకృష్ణ వ్రతం ఆచరించడానికి ముందు విఘ్నేశ్వరుని, అష్టదిక్పాలకులను, నవగ్రహ దేవతలను మనస్సులో ప్రార్థించవలెను. అటుతరువాత అయిదు కథలను చదువవలెను. ప్రతి అధ్యాయమునకు చివర గోవిందా! గోపాలా! గోకులనందనా! అని స్మరించవలెను. మీకు అందుబాటులో ఉన్న ఫలములను, పాలు, వెన్న, మీగడలను నివేదించవచ్చును. అన్నపాయసములు కూడా నివేదించవచ్చును. తులసీదళములతో పూజించిన నాకెంతో ప్రీతికరము. వ్రతకథలు పూర్తి కాగానే నివేదించిన పదార్థాలను మీరు ప్రసాదంగా స్వీకరించి మీ బంధుమిత్రులందరికీ పంచవలెను.

శ్రీకృష్ణవ్రతం పూర్తికాగానే మీరు గానీ, మీ బంధుమిత్రులు గానీ నాకిష్టమైన భజనలు, కీర్తనలుగానీ పాడవచ్చును. వాయిద్యగోష్టి కూడా జరుపవచ్చును. మరొక విశేషం చెబుతున్నాను. మీరందరూ అంటే నాకెంతో ప్రేమ, అనురాగం. ఈ వ్రతం ఎక్కడ ఆచరిస్తున్నారో నేను అక్కడ బాలకృష్ణుని రూపంలో అదృశ్యంగా నాట్యమాడుతాను. ఎంతో ఆనందంగా మురళీనాదంతో నాట్యం చేస్తాను. నా గజ్జెల చప్పుడు, నా మురళీనాదం నా ప్రియభక్తులకు వినపడతాయి. ఎవరైతే ఈ శ్రీకృష్ణ వ్రతాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారో అక్కడ నా అడుగుల ముద్రలు కూడా దర్శనమిస్తాయి. ఈ వ్రతం నాకెంతో ప్రీతికరమైనది. ఈ వ్రతం ఆచరిస్తున్నవారి ఎడల, ఈ కథలు వింటున్నవారి ఎడల నాకెంతో అనురాగం. ఆ ప్రదేశంలో ఆ రోజంతా నేను ఆడుతూ, పాడుతూ ఆనందంగా తిరుగుతుంటాను అని శ్రీకృష్ణభగవానులవారు ఆ దంపతులకు సెలవిచ్చారు.

కలియుగంలో శ్రీకృష్ణభగవానుని అనుగ్రహం పొందడానికి ఈ శ్రీకృష్ణవ్రతం ఆచరించటం ఎంతో సులభమార్గం. ఆ వ్రతం ఆచరించిన వెంటనే ఎన్నో శుభాలు జరుగుతాయని సాక్షాత్తూ శ్రీకృష్ణస్వామివారే విశ్వపతి, రుక్మిణి దంపతులకు సెలవిచ్చారు. వీలున్నప్పుడల్లా ఈ వ్రతం ఆచరించిన యెడల మన జీవితం శుభప్రదంగా గడుస్తుంది. శ్రీకృష్ణులవారి అనుగ్రహం పొందడానికి అతి తేలికైన ఈ వ్రతాన్ని మనకు వీలున్నప్పుడల్లా ఆచరించి ఆ గోకులనందనుని అనుగ్రహం పొందవలెను.

ప్రథమ అధ్యాయము సమాప్తము.

గోవిందా ! గోపాలా ! గోకులనందనా !

# శ్రీకృష్ణవ్రతం

రెండవ అధ్యాయము

## వల్లభదాసు కథ

పూర్వకాలంలో మధురానగరంలో వల్లభదాసు అనే శ్రీకృష్ణ భక్తుడు ఉండేవాడు. అతడికి శ్రీకృష్ణ భగవానుడు అంటే ఎంతో భక్తి. ఎప్పుడూ ఆ గోకులనందనునే తలుస్తూ కాలం గడిపేవాడు. తనకు సంతోషం కానీ కష్టం కానీ కలిగినా ఆ స్వామికే విన్నవించుకునేవాడు. వల్లభదాసు పూర్తి భక్తి పారవశ్యంలో మునిగితేలుతూ ఒక్కొక్కసారి ఆ గోపాలకృష్ణుడు తన ఎదురుగా ఉన్నట్లు తలచి మాట్లాడేవాడు. ఇతడి అనన్య భక్తి చూసి చుట్టుపక్కల ఇళ్ళవారు చూసి ఎంతో ఆశ్చర్యపోయేవారు.

వల్లభదాసు ప్రతిరోజు మధురలోని శ్రీకృష్ణ మందిరానికి ఉదయాన్నే వెళ్ళి స్వామిని దర్శించేవాడు. ఆ స్వామి దివ్యమంగళ స్వరూపం చూసి ఎంతో ఆనందించేవాడు. ఈ సృష్టిలో ఉన్న అందమంతా ఆ గోపాలకృష్ణునిదే! ఎంతో ప్రేమతో నిండిన ఆ నయనాలు జగత్తు మొత్తాన్ని సమ్మోహన పరిచే మురళీనాదం... తలపై నెమలి పింఛం, పెదవులపై విశ్వం మొత్తానికి రక్షా కవచంగా కనిపించే చక్కటి చిరునవ్వు. ఆ స్వామి ముగ్ధ మనోహర రూపం చూస్తూ వల్లభదాసు ఆలయంలోనే ఎక్కువ కాలం గడుపుతూ ఉండేవాడు. ఆ స్వామి తోడనే తన ప్రపంచంగా భావించేవాడు.

ఆ రోజుల్లో శ్రీకృష్ణ మందిరంలో ప్రతిరోజు ఎవరో ఒక భక్తుడు శ్రీ స్వామివారికి నైవేద్యం చేసే సమయంలో వేణుగానం ఆలపించేవాడు. కాసేపు మురళీగానంతో ఆ స్వామిని ఆనందపరచేవారు. వల్లభదాసు ఆ మురళీనాదం విని ఎంతో పరవశుడయ్యేవాడు. ఆ దివ్యనాదం వింటూ ఆ స్వామివంక తన్మయంతో చూస్తూ మైమరచిపోయేవాడు.

ఆలయానికి నిత్యం వచ్చే భక్తులందరికీ వల్లభదాసు సుపరిచితుడే! ప్రతిరోజు క్రమం తప్పకుండా మందిరానికి వచ్చి ఆ గోపాలుని సేవించే వల్లభదాసు భక్తికి అందరూ ఎంతో సంతోషపడేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాటి రాత్రి వల్లభదాసుకి ఎంతో జ్వరం వచ్చింది. మరునాటి ఉదయం కొంచెం తగ్గినా విపరీతమైన నీరసంతో అడుగు తీసి అడుగు ముందుకు వేయలేకపోయాడు. అయ్యో ఇంత నీరసంగా ఉందే, ఈరోజు ఆ స్వామిని దర్శించలేనా, మురళీనాదం వినలేనా అని బాధపడుతూ మంచంమీదనే పడుకున్నాడు. అంతలో ఒక చిన్న పిల్లవాడు ఘల్లు ఘల్లున గజ్జెల శబ్దం వస్తుండగా పరిగెడుతూ ఇంట్లోకి వచ్చాడు. వల్లభదాసు వద్దకు వచ్చి ఏం తాత దిగాలుగా ఉన్నావు అని అన్నాడు. ఆ బాలుడి చిరునవ్వు చూడగానే వల్లభదాసు నీరసం తగ్గింది. శరీరంలో కొంచెం ఓపిక వచ్చింది. ఆ పిల్లవాడిని చూసి ఎంతో ముచ్చటపడుతూ ఎక్కడినుంచి వచ్చావు నాయనా! అని అన్నాడు. అప్పుడు ఆ బాలుడు ఈ ఊరంతా నాదే అని చిలిపిగా నవ్వుతూ అన్నాడు. తన చేతిలో ఉన్న వెన్న కొంచెం వల్లభదాసుకు ఇచ్చాడు. శ్రీకృష్ణ మందిరం నుంచి తెచ్చానని చెప్పాడు. వల్లభదాసు ఆనందంతో కనులకు అద్దుకుని నోటిలో వేసుకోగానే ఎంతో ఓపిక వచ్చింది. ఇంతలో ఆ బాలుడు వల్లభదాసు మంచం మీద కూర్చుని తనతో తెచ్చుకున్న వేణువును చక్కగా ఆలపించాడు. అలా అయిదు నిమిషాలు వేణునాదం విన్న వల్లభదాసుకు నిద్ర పట్టింది. నెమ్మదిగా కనులు మూసుకుని గాఢనిద్రలోకి జారుకున్నాడు.

ఒక గంట తరువాత మెలకువ వచ్చిన వల్లభదాసుకి ఆ పిల్లవాడు కనిపించలేదు. ఇంతలో వారింటి పక్కన ఉండే కేశోభాయి వల్లభదాసు ఇంటికి వచ్చి ఏమి స్వామీ ఈ రోజు ఆలయానికి రాలేదే అన్నాడు. వల్లభదాసు అతడితో తనకు జ్వరం వచ్చిన సంగతి చెప్పాడు. ఇంతలో కేశోభాయి అతడి మంచం పక్కనే చిన్న చెక్కబల్లపై తళ తళ మెరిసిపోతున్న పిల్లనగ్రోవిని చూశాడు. వెంటనే అతడు వల్లభదాసుతో ఇలా అన్నాడు. ఓ స్వామీ! ఈ ఉదయం ఆలయానికి వెళ్లినప్పుడు అక్కడ అందరూ ఎంతో ఆందోళనతో ఉన్నారు. స్వామివారి చేతిలోని దివ్య మురళి మాయమైంది. ఎలా, ఎవరు దొంగిలించారా అని అందరూ ఆందోళన చెందారు. ఎంత వెతికినా ఎక్కడా కనపడలేదు. ఇదిగో ఇక్కడ నీచెంతనే ఉన్నది. నీవు ఎంతో పుణ్యం చేసుకున్నావు. ఆ గోపాలుడే స్వయంగా మీ ఇంటికి వచ్చి వేణునాదం వినిపించాడు అని అన్నాడు.

సాక్షాత్తూ ఆ చిన్ని కృష్ణుడే తన వద్దకు వచ్చి తన ప్రసాదాన్ని ఇచ్చి వేణుగానం వినిపించి మరీ వెళ్ళాడని తెలుసుకున్న వల్లభదాసు ఆనందానికి అవధులు లేవు. ఆ స్వామి భక్తవాత్సల్యానికి ఎంతో సంతోషించాడు. ఇప్పుడు వల్లభదాసు, కేశోభాయి ఇద్దరూ కలిసి ఆ వేణువుని తీసుకుని శ్రీకృష్ణమందిరానికి వెళ్ళి జరిగిన విషయాన్నంతా వివరించారు. అక్కడవారందరూ ఆ శ్రీకృష్ణ పరమాత్మ వల్లభదాసుపై కురిపించిన ప్రేమానురాగాలకు ఎంతో సంతోషించారు. అంతటి స్వామివారి ప్రియభక్తుడు తమ నగరం మధురలో ఉన్నందుకు వారంతా ఎంతో ఆనందపడ్డారు. ఆ గోపాలునికి తన భక్తులపై గల వాత్సల్యాన్ని తలచుకుని మురిసిపోయారు.

శ్రీకృష్ణులవారికి తన భక్తులంటే ఎంతో ప్రేమ, ఎంతో అనురాగం. తననే సర్వస్వంగా భావిస్తూ జీవించేవారిని ఎల్లవేళలా ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. గోవిందా అని ఆర్ద్రతతో పిలిస్తే చాలు, వేగంగా పరిగెత్తుకువచ్చి మనల్ని ఆదుకుంటాడు. మనల్ని ఎంతో ఆనందంతో ముంచెత్తుతాడు.

రెండవ అధ్యాయం సమాప్తం

గోవిందా! గోపాలా ! గోకులనందనా !

# శ్రీకృష్ణవ్రతం

## మూడవ అధ్యాయము

## కృష్ణన్ దంపతుల కథ

శ్రీకృష్ణుడు భక్తాధీనుడు, భక్తవత్సలుడు. ఆ స్వామికి తన భక్తులంటే పంచప్రాణాలు. ఎవరైనా తనను దూషించినా సహిస్తాడు కానీ, తన భక్తులను ఎవరైనా మాటలతో గానీ, చేతలతో గానీ బాధపెడితే వారిని ఏమాత్రం ఉపేక్షించడు, కఠినంగా శిక్షిస్తాడు. తనను నమ్మి కొలిచేవారిని మాత్రం నిత్యం కంటికి రెప్పలా కాపాడుతుంటాడు.

పూర్వకాలంలో గురువాయూరు పట్టణంలో సరస్సు ఆవలి ఒడ్డున కృష్ణన్, రాధ అనే దంపతులు నివసించేవారు. వీరిద్దరూ గొప్ప కృష్ణభక్తులు. ముఖ్యంగా రాధకు శ్రీకృష్ణుడంటే ఎంతో ప్రేమ. ఎల్లప్పుడూ ఆ గోపాలుడినే తలుస్తూ కాలం గడిపేది. ఆ దంపతులు ప్రతిరోజు ఉదయాన్నే శ్రీకృష్ణ ఆలయానికి వెళ్ళి శ్రీకృష్ణుని దర్శనం చేసుకుని వచ్చేవారు. వీరు ఎంతో సత్ప్రవర్తనతో జీవిస్తున్నప్పటికీ పూర్వజన్మ కర్మలఫలితంగా వీరికి సంతానం కలుగలేదు. అందువలన తమ చుట్టుపక్కల ఇళ్ళలో గల పిల్లలందరినీ తమ సంతానంలాగానే భావించేవారు. పిల్లలకు ఎన్నో తినుబండారాలు కొనిపెట్టేవారు. ఆట వస్తువులు ఇచ్చేవారు. వారిని చూసి ఎంతో మురిసిపోయేవారు. ఇలా వీరిద్దరూ అరవై సంవత్సరాల వయస్సు దాటారు.

ప్రతీ సంవత్సరం రాధకు శ్రీకృష్ణాష్టమినాడు ఒక చిన్నపిల్లవాడిని బాలకృష్ణుని లాగ అలంకరించి భోజనం పెట్టి కొత్తబట్టలిచ్చి పంపే అలవాటు ఉండేది. ఆ పిల్లవాడికి ఎన్నో బహుమానాలు ఇచ్చేది. రాధకు ఉన్న ఈ ముచ్చట చూసి చుట్టుపక్కల వారు ఎంతో మురిసిపోయవారు. శ్రీకృష్ణాష్టమి వస్తున్నది అంటే రాధకు వారం రోజులు ముందునుంచే పండగలాగా ఉండేది. ఇల్లంతా రకరకాల పూలతో అలంకరించేది. చుట్టుపక్కల పిల్లలకోసం ఎన్నో రకాల పిండివంటలు చేసిపెట్టేది.

ప్రతీ సంవత్సరం లాగానే ఆ సంవత్సరం కూడా కృష్ణాష్టమి వచ్చింది. ముందురోజు దగ్గర ఇంటిలో ఉన్న ముకుందన్ అనే పిల్లవాడిని మర్నాడు ఉదయమే కృష్ణుని అలంకారానికి రమ్మని చెప్పింది. మర్నాడు ఉదయం లేవగానే త్వరత్వరగా పిండివంటలన్నీ చేసింది. ఎన్నో రకాల పళ్ళు కొని తెచ్చింది. ముకుందన్ ఆడుతూ పాడుతూ ఎనిమిది గంటలకల్లా ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడికి చక్కగా కొత్తబట్టలు తొడిగించి, చక్కగా అలంకరించి రకరకాల ఆటలు ఆడుకున్నది. ముకుందన్ ఆకలి వేస్తున్నదంటే పిల్లవాడిని కూర్చోపెట్టి భోజనం వడ్డించింది. ముకుందన్ వండిన పదార్థాలు ఆనందంగా తింటూ ఉంటే రాధ ముచ్చటగా ఎదురుగా కూర్చుంది. వారిద్దరిని అలా చూస్తుంటే కృష్ణన్‌కు ఎంతో ముచ్చటవేసింది.

ఇంతలో ఆ పిల్లవాడు అమ్మా నాకు మామిడిపండు కావాలి అన్నాడు, రాధ అతడితో కన్నా! ఇప్పుడు మామిడి పండ్లు దొరకవు కదా! నీకు చక్కటి అరటిపండ్లు, జామపండ్లు తెచ్చి పెట్టనా అంది. అప్పుడు ముకుందన్ అమ్మా! నువ్వు మామిడిపండ్లు తెచ్చావు, నాకు అబద్ధం చెపుతున్నావు అన్నాడు. రాధ నవ్వుతూ లేదు నాయనా! తేలేదు, మామిడిపండ్ల కాలం వెళ్ళిపోయింది కదా అని అన్నది. ముకుందన్ రాధతో లేదమ్మా కావాలంటే వెళ్ళి పండ్లబుట్ట చూడు, మామిడిపండ్లు ఉన్నాయి అన్నాడు. అప్పుడు రాధ లేచి వెళ్ళి పండ్లబుట్ట చూస్తే ఆశ్చర్యకరంగా అందులో రెండు మామిడిపండ్లు కనపడ్డాయి. రాధ ఎంతో ఆశ్చర్యపడుతూ ఆ పండ్లు తీసుకుని ముకుందన్‌కు వడ్డించింది. అప్పుడు ముకుందన్ చూశావా అమ్మా! మామిడిపండ్లు ఉన్నాయి కదా! అని వాటిని తీసుకుని ఎంతో సంతోషంగా తిన్నాడు. ఆ తరువాత కాసేపు ఆడుకుని ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంతలో సమయం మధ్యాహ్నం నాలుగు గంటలయ్యింది. ఎవరో తలుపు కొడితే రాధ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ముకుందన్ తల్లి! ఆమె రాధతో ఇలా అంది. రాధా! ఏమీ అనుకోకు, ఉదయం ముకుందన్ మీ ఇంటికి రాలేకపోయాడు. వాడికి

రాత్రంతా ఒకటే జ్వరం అని అన్నది. అప్పుడు రాధ ఆశ్చర్యపోయింది. ఉదయం ముకుందన్ వచ్చి భోజనం చేయటం, మామిడిపండ్లు అడిగి మరీ తినటం చెప్పింది. వారిద్దరికి ఆశ్చర్యానికి అంతు లేదు. అప్పుడు వారికి జరిగినది అర్థమైంది. ఉదయం కృష్ణన్, రాధ దంపతుల ఇంటికి వచ్చింది సాక్షాత్తూ బాలకృష్ణుడే అని తెలుసుకుని ఆ దంపతులు ఎంతో ఆనందపడ్డారు. ముకుందన్ తల్లి కూడా ఈ దంపతులపై బాలకృష్ణుడు చూసించిన అనుగ్రహానికి ఎంతో సంతోషించింది. ఆ దంపతులిద్దరూ సాయంత్రం ఆలయానికి వెళ్ళారు.

అక్కడకు వెళ్ళగానే అక్కడ భక్తులందరూ ఏదో చర్చించుకుంటూ కనపడ్డారు. విషయం ఆరాతీస్తే ఆ రోజు మధ్యాహ్నం నుంచి గర్భాలయం నుంచి మామిడిపండ్ల వాసన వస్తోంది. ఈ కాలంలో మామిడిపండ్లు దొరకవు కదా! ఈ మామిడిపండ్ల వాసన ఎలా వస్తోందో ఎవరికీ అర్థం కాలేదు. ఈ సంగతి విన్న కృష్ణన్ రాధ దంపతులకు ఆనందంతో కనులవెంట నీరుకారాయి. ఉదయం బాలకృష్ణుడే తమ ఇంటికి వచ్చి మామిడిపండ్లు వడ్డించుకున్నాడు. ఈ విషయం అక్కడున్న భక్తులందరికీ చెప్పారు. ఆలయంలో మామిడిపండ్ల వాసన రావడానికి గల కారణం భక్తులందరికీ అర్థమైంది. కృష్ణన్ రాధ దంపతుల భక్తికి అందరూ ఎంతో సంతోషించారు.

శ్రీకృష్ణులవారికి తన భక్తులంటే అంతటి వాత్సల్యం, అంతటి అనురాగం. ఎల్లవేళలా ఆ స్వామినే స్మరించే వారి యోగక్షేమాలు తానే వహిస్తాడు. మనం చేయవలసిందల్లా అహకారం పూర్తిగా వదిలివేసి మన మనస్సును ఎప్పుడూ ఆ స్వామిపైననే లగ్నం చేయడం. మనకు కావలసినవన్నీ ఆ స్వామి సమకూరుస్తాడు. ఆ గోపాలకృష్ణుని నమ్మి కొలచేవారి జీవితం ఎప్పుడూ శుభప్రదంగా గడుస్తుంది.

మూడవ అధ్యాయం సమాప్తం

గోవిందా! గోపాలా ! గోకులనందనా !

# శ్రీకృష్ణవ్రతం

నాల్గవ అధ్యాయము

## రంగదాసుని కథ

శ్రీకృష్ణుడు అత్యంత దయామయుడు. ఈ సృష్టిమొత్తం ఆ గోకులనందనుడే వ్యాపించియున్నాడు. ఈ సృష్టిమొత్తం ఆ గోవిందుని ప్రతిరూపాలే. ఎవరైతే ప్రతిజీవిలోనూ ఆ శ్రీకృష్ణపరమాత్మను చూడగలుగుతారో వారి జీవితం ధన్యమౌతుంది. ఒకసారి ఎలుగెత్తి మనస్ఫూర్తిగా ఆ స్వామినే స్మరిస్తూ గోవిందా అని పిలిస్తే చాలు తక్షణం మన మొర ఆలకిస్తాడు, మనముందు ప్రత్యక్షమౌతాడు. అంతటి ప్రేమమూర్తి ఆ పురుషోత్తముడు.

పూర్వకాలంలో ఉడుపి పట్టణంలో రంగదాసుడు అనే భక్తుడు ఉండేవాడు. అతడికి శ్రీకృష్ణుడే సర్వస్వం. రోజూ పట్టణంలోని శ్రీకృష్ణ మందిరానికి వెళ్ళి ఆ స్వామిని తనివితీరా దర్శిస్తాడు. ప్రతీక్షణం ఆ స్వామిమీదనే ధ్యాస. అతడి భార్య వసుధ కూడా ఎంతో గొప్ప కృష్ణభక్తురాలు. ఏ పనిలోనూ ఆ గోపాలునే తలుస్తూ కాలం గడిపేది. ఈ దంపతులిద్దరూ ఇరుగుపొరుగువారికి ఎంతో సహాయపడుతూ ఉండేవారు. అందరిలో ఆ శ్రీకృష్ణపరమాత్మనే దర్శించేవారు.

రంగదాసు, వసుధ దంపతుల ఇంట్లో చక్కటి శ్రీకృష్ణులవారి విగ్రహం ఉంది. చేతిలో మురళి పట్టుకుని ఉన్న ఆ బాలకృష్ణుడు ఎంతో ముచ్చటగా ఉండేవాడు. ప్రతిరోజూ ఆ స్వామి ఎదురుగా నుంచుని ఆ దంపతులిద్దరూ సుమధురంగా పాటలు పాడేవారు. ఆ స్వామికి వెన్నమీగడలు నైవేద్యం పెట్టేవారు. ప్రతీరోజు రాత్రి గోరువెచ్చటిపాలు నివేదించి జోలపాటలు పాడేవారు.

ఒకనాటి రాత్రి ఆ విధంగానే స్వామికి చక్కటి జోలపాట పాడి తాము కూడా నిద్రించారు. రాత్రి రెండుగంటల వేళ పెద్ద శబ్దం వచ్చింది. ఒక దొంగ చేతిలో పెద్ద గునపంతో వీధి తలుపు పగలకొట్టి లోనికి ప్రవేశించాడు. అతడి భీకరరూపం చూడగానే రంగదాసు, వసుధ దంపతులకు నోటమాట రాలేదు. నోరు తెరిస్తే చంపేస్తానని గట్టిగా అరిచాడు. అతడికి రెండు చేతులు జోడించి మా వద్ద ఏముంటుంది నాయనా! కడు బీదవారం అని అన్నారు.

అయితే ఆ దొంగ ఏమాత్రం వినకుండా ఇంకా గట్టిగా అరుస్తూ ఏమీ లేదా? అయితే మీ ప్రాణాలే తీస్తానన్నాడు. రంగదాసు దంపతులు ఎంతో ఆందోళన చెందారు. వెంటనే గోవిందా! గోపాలా! గోకులనందనా! నీవే మాకు దిక్కు అని గట్టిగా అరిచారు. అంతే! అద్భుతం! ఒక్కసారిగా తాము రోజూ కొలిచే బాలకృష్ణుని విగ్రహం పక్కన ఉన్న కిటికీనుంచి పెద్దగాలి వీచి ఆ విగ్రహం ఒక్కసారిగా కదిలి ఆ దొంగమీద పడింది. అనుకోని ఈ పరిణామానికి ఆ దొంగ స్పృహ కోల్పోయి కింద పడ్డాడు. ఇంతలో రంగదాసు దంపతులు పెట్టిన కేకలు విని పక్క ఇళ్ళవారు మేల్కొని పరుగు పరుగున ఇక్కడికి వచ్చారు. కింద పడి ఉన్న దొంగను చూశారు. బాలకృష్ణుని విగ్రహం చూశారు. రంగదాసు దంపతులు వారికి జరిగిన విషయమంతా చెప్పారు. అంత గాలి ఎలా వచ్చిందో ఆ విగ్రహం అంత వేగంగా పడినా ఏమాత్రం చెక్కు చెదరకుండా ఎలా ఉన్నదో వారికి ఆశ్చర్యంగా తోచింది. ఆ శ్రీకృష్ణుడే తమల్ని అలా రక్షించాడని గ్రహించారు. స్వామి విగ్రహాన్ని కనులకద్దుకుని తిరిగి ఆ గూటిలో ఉంచారు. శ్రీకృష్ణుడు రంగదాసు దంపతులను రక్షించిన విషయం తెలుసుకుని ఆ ఊరి వారంతా ఆ దంపతులపై శ్రీకృష్ణ భగవానుడు చూపిన అనుగ్రహానికి ఎంతో ఆనంపడ్డారు.

శ్రీకృష్ణుడు భక్తాధీనుడు. మనసారా ఆ స్వామిని కొలిచినవారిని కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి. సృష్టిలోని దేవతలందరూ ఆ స్వామి స్వరూపాలే!. ఎవరు ఏ దేవతను కొలిచినా అవన్నీ ఆ చేరేది ఆ గోవిందునికే !. ఆ శ్రీకృష్ణ భగవానుని నిత్యం స్మరిస్తూ మన జన్మ ధన్యం చేసుకుందాము.

నాలుగవ అధ్యాయం సమాప్తం

గోవిందా! గోపాలా ! గోకులనందనా !

# శ్రీకృష్ణవ్రతం

అయిదవ అధ్యాయము

## మాధవుని కథ

శ్రీకృష్ణుడు పరమదయా స్వరూపుడు. ఆ స్వామిని నమ్ముకున్న వారికి ఎటువంటి ఆపదలూ దరిచేరవు. ఆ స్వామినే నిత్యం స్మరించే వారి జీవితం శుభప్రదంగా గడుస్తుంది. గోకులనందనుడు భక్తవత్సలుడు. ఆశ్రితజన పక్షపాతి. ఆ స్వామి అనుగ్రహం పొందడానికి ఏ యజ్ఞ యాగాదులు చెయ్యనవసరం లేదు. భక్తితో ఒక చిన్న తులసీదళం సమర్పించినా ఆనందిస్తాడు.

పూర్వకాలంలో గోవిందపురంలో మాధవుడనే భక్తుడు ఉండేవాడు. అతడికి ఆ కృష్ణ స్వామి అంటే ఎంతో భక్తి. ఆ ఊరిలో ఒక గొప్ప శ్రీకృష్ణ ఆలయం ఉండేది. అందులో ఎంతో అందమైన రాధా సమేత శ్రీకృష్ణుల వారి విగ్రహాలు ఉండేవి. అయితే ఆ రోజుల్లో ఉన్న కట్టుబాట్లు, సంప్రదాయాల వలన ఆ ఆలయంలోనికి నిమ్నజాతివారికి ప్రవేశం ఉండేదికాదు. మాధవుడు తక్కువజాతి వాడు అవడం చేత ఆలయంలోనికి వెళ్ళలేకపోయేవాడు. కానీ ఎల్లప్పుడు ఆ రాధాకృష్ణులనే తలుస్తూ కాలం గడిపేవాడు.

ప్రతీరోజు ఆలయం బయటకూర్చుని ఆలయ గోడలపైన ఉన్న రాధాకృష్ణుల విగ్రహమూర్తులను చూస్తూ ఒళ్ళు మైమరిచిపోయేవాడు. అతడి భక్తి చూసి అందరూ ఎంతో ఆశ్చర్యపోయేవారు. అతనిని ఆలయంలోనికి తీసుకెళ్ళి ఆ రాధాకృష్ణుల దర్శనం

ఇప్పించాలని కొందరు తలచినా ఆలయ అధికారుల అనుమతి రాకపోవడం చేత అది సాధ్యమయ్యేది కాదు. అందుకు వారెంతో బాధపడేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకసారి మాధవుడికి ఏదో వింత చర్మవ్యాధి పట్టుకున్నది. ఎన్నిమందులు వాడిన ఫలితం లేకపోయింది. శరీరమంతా ఎంతో బాధగా ఉండేది. ఈ బాధతో ఆలయం వద్దకు కూడా వెళ్ళలేకపోయేవాడు. ఇంటినుండే రాధాకృష్ణులను తలుస్తూ, స్మరిస్తూ కాలం గడపసాగాడు. ఈ వ్యాధి నుంచి ఉపశమనం కలిగించమని ఆ గోకుల నందనుడినే పరిపరివిధాల వేడుకున్నాడు.

ఇంతలో ఆ ఆలయ వార్షికోత్సవాలు వచ్చాయి. ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు జరిగే వార్షికోత్సవాలలో చివరి రోజు ఎంతో అద్భుతంగా ఉండేది. ఆ స్వామి ఉత్సవమూర్తులను, గోవిందపురంలోని అన్ని వీధులలోను ఊరేగించేవారు. ఊరంతా ఆ రోజు ఎంతో కోలాహలంగా ఉండేది. రాధాకృష్ణుల ఉత్సవమూర్తులను ఎంతో అందంగా అలంకరించి ఊరేగించేవారు. ఈ సంవత్సరం కూడా మూడవనాడు రాధాకృష్ణులను ఎంతో అందమైన వస్త్రాలతో, ఆభరణాలతో, చక్కటి పూలమాలలతో చక్కటి తులసిమాలలతో అలంకరించి ఊరేగింపుతో బయలుదేరారు. శ్రీకృష్ణులవారి తలపై అద్భుతమైన నెమలి పింఛం ఎంతో అందంగా ఉన్నది.

ఊరేగింపు ఒక్కొక్క వీధి తిరుగుతూ మాధవుడి వీధికి వచ్చింది. మాధవుడు ఇంటినుంచి బయటకు వచ్చి ఆ ఊరేగింపు ఆనందంతో చూడసాగాడు. రాధాకృష్ణుల దివ్యసౌందర్యానికి ఎంతో మురిసి పోయాడు. ఇంతలో ఒక అద్భుతం జరిగింది. రాధాకృష్ణుల మూర్తులు గోవిందుడి ఇంటివద్దకు రాగానే ఒక్కసారిగా శ్రీకృష్ణుని తలలోని నెమలిపింఛం ఎగిరి మాధవుడిపై పడింది. ఆ పింఛం మాధవుడి శరీరానికి తగలగానే మాధవుడికి ఒక్కసారిగా శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్లు అయింది. చర్మవ్యాధి క్షణంలో మాయమయింది. ఇదంతా ఆ శ్రీకృష్ణులవారి అనుగ్రహంగా గ్రహించిన మాధవుడి కంట ఆనందభాష్పాలు రాలాయి.

ఇదంతా గమనించిన భక్తులు, ఆలయ అధికారులు ఎంతో ఆశ్చర్యపోయారు. ఆ గోకులనందనునికి మాధవుడంటే ఎంత ప్రేమో గ్రహించారు. మాధవుడి కాళ్ళమీద పడి తమను క్షమించమని అర్థించారు. మాధవుని మెడలో పూలమాలవేసి ఆ ఊరేగింపుతో పాటు సకల మర్యాదలతో ఆలయానికి తీసుకెళ్ళారు. ఆనాటినుండి ఆస్వామి దర్శనానికి అన్ని నియమాలను తొలగించారు. అన్ని జాతులవారికి ఆలయ ప్రవేశం కల్పించారు. ఆ స్వామి అనుగ్రహం పొందడానికి పుట్టిన కులంతో సంబంధం లేదని అందరూ గ్రహించారు. అప్పటినుంచి భక్తులందరికీ ఆ రాధాకృష్ణుల దర్శనం అద్భుతంగా జరగసాగింది.

శ్రీకృష్ణుడు ప్రేమస్వరూపుడు. ఆ గోపాలకృష్ణుడికి తన భక్తులంటే ఎంతో అనురాగం, ఆప్యాయత. కలియుగంలో ఆ స్వామి అనుగ్రహం పొందడానికి ఈ శ్రీకృష్ణ వ్రతం ఆచరించటం అతి తేలిక మార్గం. ఈ వ్రతం నిత్యం ఆచరించి మనందరమూ సుఖశాంతులతో, శుభప్రదంగా జీవించుదాము. జీవితం ధన్యం చేసుకుందాము.

అయిదవ అధ్యాయం సమాప్తం

గోవిందా! గోపాలా ! గోకులనందనా !
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం తత్సత్ సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

# శ్రీకృష్ణాష్టకం

వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

అతసీ పుష్ప సంకాశం హార నూపుర శోభితమ్ ।
రత్న కంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

కుటిలాలక సంయుక్తం పూర్ణచంద్ర నిభాననమ్ ।
విలసత్ కుండలధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

మందారగంధ సంయుక్తం చారుహాసం చతుర్భుజమ్ ।
బర్హిపింఛావ చూడాంగం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

ఉత్ఫుల్ల పద్మ పత్రాక్షం నీల జీమూత సన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

రుక్మిణీకేళి సంయుక్తం పీతాంబర సుశోభితం
అవాప్తతులసీగంధం  కృష్ణం వందే జగద్గురుమ్ ॥

గోపికానాం కుచద్వంద్వ కుంకుమాంకిత వక్షసమ్ ।
శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితమ్ ।
శంఖచక్ర ధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

కృష్ణాష్టక మిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటిజన్మకృతం పాపం స్మరణేన వినశ్యతి ॥

# మధురాష్టకం

అధరం – మధురం, వదనం – మధురం
నయనం – మధురం, హసితం – మధురం
హృదయం – మధురం, గమనం – మధురం
మధురాధిపతే రఖిలం మధురం ॥1॥

వచనం – మధురం, చరితం – మధురం
వసనం – మధురం, వలితం – మధురం
చలితం – మధురం, భ్రమితం – మధురం
మధురాధిపతే రఖిలం  మధురం ॥2॥

వేణుర్మధురో రేణుర్మధురః
పాణిర్మధురః పాదౌ మధురః
నృత్యం – మధురం,  సఖ్యం  – మధురం
మధురాధిపతే రఖిలం  మధురం ॥3॥

గీతం – మధురం, పీతం – మధురం
భుక్తం – మధురం, సుప్తం – మధురం
రూపం – మధురం, తిలకం – మధురం
మధురాధిపతే రఖిలం మధురం ॥4॥

కరణం – మధురం, తరణం – మధురం
హరణం – మధురం, స్మరణం – మధురం
వమితం – మధురం, శమితం – మధురం
మధురాధిపతే రఖిలం  మధురం ॥5॥

గుంజా – మధురా, మాలా – మధురా
యమునా – మధురా, వీచీ – మధురా
సలిలం – మధురం, కమలం – మధురం
మధురాధిపతే రఖిలం  మధురం ॥6॥

గోపీ – మధురా, లీలా – మధురా
యుక్తం – మధురం, ముక్తం – మధురం
దృష్టం – మధురం, శిష్టం – మధురం
మధురాధిపతే రఖిలం మధురం ॥7॥

గోపా – మధురా, గావో – మధురా
యష్టిర్మధురా, సృష్టిర్మధురా
దళితం – మధురం, ఫలితం – మధురం
మధురాధిపతే రఖిలం  మధురం ॥8॥

॥ ఇతి శ్రీమద్వల్లభాచార్యకృతం మధురాష్టకం సంపూర్ణం ॥